
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విజయనగరం

జిల్లా వార్తలు

ఆదివారం 26 అక్టోబరు 2025

పత్తి రైతు కంట క'న్నీరు'

● ఎడతెరపిలేని వర్షాలకు కుళ్లిపోయిన కాయలు

● తెగుళ్లు సోకి మరింత నష్టం



పత్తిని ఆరబెడుతున్న రైతు కుటుంబీకులు

మన బస్సులు భద్రమేనా?



● ఆగస్టు 19న విజయనగరం మండలం చెల్లూరు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. విజయవాడ నుంచి పాలకొండ వెళుతుండగా తెల్లవారుజామున డివైడర్ ఎక్కి రోడ్డుపైకి దూసుకుపోయింది. ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈఘటనలో పది మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

జిల్లా మీదుగా వందలాదిగా వెళ్తున్న ట్రావెల్ బస్సుల్లో ప్రయాణం భద్రమేనా? అన్న ప్రశ్న అందరిలో ఉదయిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటివరకు పెద్దగా పట్టించుకోకపోయినా కర్నూల్ బస్సు ప్రమాదంతో ఆలోచన మొదలైంది. కొన్ని లోపాలు తరచూ చర్చకు వస్తున్నా ఏం కాదులే అన్న నిర్లిప్తతతో యథావిధిగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రధానంగా ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలను పాటించడం లేదు. ఆర్టీవో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒడిశా, చత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న ట్రావెల్ బస్సులు జెట్ స్పీడుతో వెళ్తున్నాయని అందరూ చెప్పుకుంటున్న మాట. బస్సులో వైరింగ్ సిస్టమ్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం లేదని పలువురు ప్రయాణికులు చెబుతున్నారు.

● జిల్లా నుంచి 100కు పైగా ట్రావెల్ బస్సుల రాకపోకలు
● మరో 200 వరకూ జిల్లా మీదుగా ప్రయాణం
● ఒడిశా, చత్తీస్‌గఢ్‌కు జెట్ స్పీడుతో వాహనాలు
● భద్రత ప్రమాణాలు అంతంతే..
● మొక్కుబడిగా ఆర్టీవో అధికారుల తనిఖీలు



బస్సు లోపల బెడ్‌లతో ఇలా..

విజయనగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, చత్తీస్‌గడ్‌లకు మధ్యస్థంగా ఉండే విజయనగరం మీదుగా ప్రతిరోజూ అనేక ట్రావెల్ బస్సులు ప్రయాణిస్తుంటాయి. ప్రధాన రవాణా కేంద్రంగా కూడా ఉంది. సుమారు 100 పైగా ట్రావెల్ బస్సులు ఇక్కడి నుంచే బయలుదేరుతున్నాయి. 200 వరకు ట్రావెల్ బస్సులు జిల్లా మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. చత్తీస్‌గడ్‌లోని బిలాయ్, రాయ్‌పూర్, జైపూర్ తదితర ప్రాంతాలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్, (మిగతా 8వ పేజీలో..)



రవాణా శాఖాధికారుల తనిఖీలు

● నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నాలుగు బస్సులు సీజ్



ప్రైవేటు బస్సుల రికార్డులను పరిశీలిస్తున్న డీటీసీ మణికుమార్, ఎంవీఐలు

విజయనగరం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖాధికారులు శనివారం సాయంత్రం ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను విజయనగరంలో తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు. రవాణాశాఖ ఉప కమిషనర్ మణికుమార్ ఆధ్వర్యంలో సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీ ప్రకాష్, ఎంవీఐ నవీన్‌కుమార్, ఇతర సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నగరంలో ఎల్‌ఐసీ భవనం సమీపంలో వాహన రికార్డులను పరిశీలించారు. కొన్ని వాహనాల్లో సిటింగ్ బదులు స్లీపింగ్ బెర్తులుగా సర్దుబాటు చేశారు. గమనించిన ఆర్‌టీవో అధికారులు ఆరా తీశారు.

సమన్యాయం అందరి హక్కు

● జిల్లా న్యాయాధికారి బబిత



న్యాయ అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి బబిత, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తదితరులు

విజయనగరం కలెక్టరేట్/ విజయనగరం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమన్యాయం పొందడం అందరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని జిల్లా న్యాయాధికారి ఎం.బబిత అన్నారు. పేదరికం లేదా ఇతరత్రా కారణాల వల్ల ఏ ఒక్కరూ న్యాయం పొందకుండా ఉండలేరని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలు, నిరుపేదలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర వర్గాలకు రక్షణ కల్పిస్తున్న చట్టాలపై అవగాహన కోసం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం సంయుక్తంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి బబిత మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఆదాయం రూ.3 లక్షలు కంటే తక్కువ ఉన్న పేదలు, మహిళలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు తదితర బలహీనవర్గాల వారు న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించవచ్చని చెప్పారు. ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం, లోక్ అదాలత్‌లు నిర్వహించడం, న్యాయ అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయడం , బాధితులకు అండగా నిలవడం ఈ సంస్థ లక్ష్యాలని వివరించారు. ప్రతి ఒక్కరికీ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించడం ద్వారా వాటిని ఉల్లంఘించకుండా చూడవచ్చన్నారు.

టోల్ ఫ్రీ నెంబరు 15100

డీఎల్ఎస్ఏను నేరుగా కాని టోల్ ఫ్రీ నెంబరు 15100కు కాని ఫోన్ చేయడం ద్వారా న్యాయ సహాయాన్ని పొందే అవకాశం ఉందని (మిగతా 8వ పేజీలో..)



తుఫాన్ ముప్పు

● రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ● అప్రమత్తమైన యంత్రాంగం
● అధికారులకు సెలవుల రద్దు ● వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు కలెక్టర్ ఆదేశం ● వణుకుతున్న వరి రైతు
● రిజర్వాయర్లలోకి అధికంగా వరద నీరు

కంట్రోల్ రూమ్‌లు

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్: 08922-236947, 8523876706
విజయనగరం ఆర్‌డీవో కార్యాలయం: 8885893515
చీపురుపల్లి ఆర్‌డీవో కార్యాలయం: 9704995807
బొబ్బిలి ఆర్‌డీవో కార్యాలయం: 9989369511,
విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం: 9849906486,
ఏపీఈపీడీసీఎల్: 9490610102,
టోల్ ఫ్రీ నెంబరు: 1912

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరో తుఫాన్ ముప్పు పొంచి ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవొచ్చునని తెలిపింది. వరి పంట గింజ కడుతున్న ఈ దశలో వర్షాలు కురిస్తే ఇబ్బందేనని అన్నదాతలు కలవరపడుతున్నారు. వాతావరణ నిపుణుల సూచనలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులకు సెలవులు రద్దు చేశారు. మరోవైపు నదులు, వాగులు పొంగుతున్నాయి. చెరువులన్నీ ప్రమాదపు అంచులో ఉన్నాయి. ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీటి నిల్వలు చేరాయి. కాగా తుఫాన్ వస్తే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. ఇరిగేషన్ అధికారులు కాల్వల్లో ప్రవాహం, రిజర్వాయర్ల నిల్వ స్థాయిలను పర్యవేక్షించాలన్నారు. అవసరమైన బియ్యం, నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ నిల్వలను తగిన చోట్ల సిద్ధంగా ఉంచాలని పౌర సరఫరాల శాఖను ఆదేశించారు. కలెక్టరేట్, ఆర్‌డీవో, మున్సిపల్, తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. సెలవులో ఉన్న అధికారులు సెలవులు రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు.



పొట్టదశలో ఉన్న వరి చేను

తాటిపూడిలోకి భారీగా ఇన్‌ఫ్లో

తాటిపూడి రిజర్వాయర్ నీటి మట్టం 297 అడుగులు కాగా ప్రస్తుతం 295.80 అడుగుల వరకు నీరుంది. జలాశయంలోకి సుమారు 3675 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో స్పిల్‌వే గేటును తెరిచి గోస్తనీ నదిలోకి 4257 క్యూసెక్కులను విడిచిపెట్టినట్లు తాటిపూడి ఏఈ శంకర్ తెలిపారు. ఆదివారం రెండో గేటు తెరుస్తామని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.





బంగ్లాలో బందీలుగా..

● ఆ దేశ కోస్టుగార్డు అదుపులో జిల్లా మత్స్యకారులు
● స్వదేశానికి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం

బంగ్లాదేశ్ కోస్టుగార్డు అదుపులో సంకెళ్లతో ఉన్న తొమ్మిది మంది మత్స్యకారులు

భోగాపురం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఈనెల 22న బంగ్లాదేశ్ కోస్టుగార్డుకు చిక్కిన తొమ్మిది మంది మత్స్యకారులు అక్కడి జైలులో బందీలుగా ఉన్న విషయం తెలిసిందే. అక్కడి అధికారులు తాజాగా విడుదల చేసిన ఫొటోలో మత్స్యకారులంతా సంకెళ్లతో ఉన్నారు. వీరిని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

భోగాపురం మండలం కొండ్రాజుపాలెంకు చెందిన మారుపల్లి చిన్నప్పన్న, మారుపల్లి రమేష్, సూరాడ అప్పలకొండ (మిగతా 8వ పేజీలో..)



ఆకట్టుకున్న నరకాసుర దహనం

బొబ్బిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక సింగారపు వీధి వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నరకాసుర దహన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బొబ్బిలి కోట నుంచి సుమారు 60 అడుగుల నరకాసురుని బొమ్మను మేళతాళాలతో, డ్యాన్సులతో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తరలించారు. అనంతరం నరకాసుర వధ చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నరకాసురుని బొమ్మపైకి ఆయన అగ్ని బాణం వదిలారు. ఈ ప్రక్రియను అందరూ ఆసక్తిగా తిలకించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు చెలికాని వేణు, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, యెన్నా బాబు తదితరులు పాల్గొన్నారు. సీఐ కటకం సతీష్‌కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నరకాసురుని బొమ్మపైకి బాణం వదులుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి



బొబ్బిలి రూరల్: పుట్ట వద్ద పూజకు బయలుదేరిన కోమటిపల్లి హాస్టల్ విద్యార్థులు, ప్రిన్సిపాల్

విజయనగరం కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు నాగుల చవితిని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఎటు చూసినా చవితి సందడి కనిపించింది. వాతావరణం అనుకూలించడంతో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ చవితి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయనగరంతో పాటు సమీప ప్రాంతాలన్నీ లే అవుట్‌లుగా విస్తరించిన నేపథ్యంలో నాగేంద్రునికి గుడ్లు, పాలు పోసేందుకు పుట్టలు కరువయ్యాయి. దీంతో శివారు ప్రాంతాలకు వాహనాల్లో వెళ్లి నాగేంద్రునికి పూజలు చేశారు. నువ్వులతో తయారు చేసిన ఉండలు, తాటి ముంజులు, నలివిడి, వడపప్పు నైవేద్యంగా సమర్పించి పుట్టలో గుడ్లు, పాలు పోశారు. ఇదిలా వుండగా నాగుల చవితి పూజలు జరిగిన వెంటనే కొంత మంది గుడ్ల కోసం పుట్టల వద్దకు పరుగులు తీశారు.

రేపు కొత్తవలసలో పీజీఆర్ఎస్

కొత్తవలస, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొత్తవలస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పి.అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరవుతారని చెప్పారు. ఈ వేదికలో రెవెన్యూ సమస్యలతో పాటు మిగిలిన ప్రభుత్వ శాఖలలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే వీలుందన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఆన్‌లైన్ చేస్తారని చెప్పారు.

జాతీయ స్థాయి సంగీత పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో ఈనెల 24న నిర్వహించిన పోటీల్లో వీరు పాల్గొని, ప్రథమ బహుమతి సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు హెచ్ఎం పద్మాదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ సారిపల్లి వెంకటరావు.. గైడ్ టీచర్స్ శ్రీనివాసరావు, రవిలకు, విద్యార్థులకు శనివారం అభినందనలు తెలిపారు.

బైండోవర్ కేసుల నమోదు

భోగాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న 16మందిని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మ ముందు హాజరు పరిచారు. ఈ మేరకు వారిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

పందెంరాయుళ్ల అరెస్టు

భోగాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవనాం జంక్షన్ పెట్రోల్ బంకు సమీప కొబ్బరి తోటలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ కె.దుర్గాప్రసాదురావు శనివారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి.. పోలిపల్లి, డెంకాడ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఏడుగురు పందెంరాయుళ్లను అరెస్టు చేశామని చెప్పారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, 9 కోళ్లు, రూ.3,400 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

స్తంభాల చోరీ

భోగాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బసవపాలెం సమీపంలో సర్వే నెంబరు63 ఖాతా నెంబరు 648లో 33 సెంట్ల స్థలం చుట్టూ పాతిన 23 ఫెన్సింగ్ స్తంభాలను దొంగిలించినట్టు గ్రామానికి చెందిన గాలి అప్పారావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.దుర్గాప్రసాదరావు శనివారం తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తామని ఆయన చెప్పారు.

నేడు రారవే సమావేశం

రాజాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజాం రచయితల వేదిక నిర్వహిస్తున్న నెలవారీ సాహిత్య కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు గార రంగనాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త, కవి రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షత వహించే సభలో రౌతు వాసుదేవరావు రచించిన 'తూరుపు కొండల్లో మెరిసిన మేరింగి' అనే నవలపై డాక్టర్ అల్లి మోహన్‌రావు ముఖ్యప్రసంగం చేస్తారని చెప్పారు. ఈ సమావేశానికి భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని రంగనాథం కోరారు.

నిరసన ర్యాలీకి తరలి రండి

నెల్లిమర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసన ర్యాలీలు చేపట్టనుందని వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఘనంగా కంచమ్మతల్లి జాతర


కంచమ్మతల్లిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకుడు రామ్‌మల్లిక్‌నాయుడు

మెరకముడిదాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొండలావేరు గ్రామ ఇలవేల్పు కంచమ్మ తల్లి జాతరను ప్రతిఏటా నాగుల చవితి రోజున నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు శనివారం బోడికొండపై ఉన్న కంచమ్మతల్లిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్ఐ లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు కొండపై తాగునీరు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

- జిల్లా అంతటా సందడి
- పుట్టల్లో పాలు పోసి.. పూజలు చేసిన భక్తులు

జిల్లాలో నాగులచవితి పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఎటు వైపు చూసినా సందడి కనిపించింది. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లారు. పుట్టల్లో గుడ్లు, పాలు పోసి.. పూజలు చేశారు. బాణసంచా కాల్చి సంతోషంగా గడిపారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


గంట్యాడలో పుట్ట వద్ద కుటుంబ సభ్యులతో మంత్రి శ్రీనివాస్


నెల్లిమర్లలో భూలోకమ్మ పుట్ట వద్ద పూజలు


సాలూరు: పుట్ట వద్ద పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి, కుటుంబ సభ్యులు


కొత్తవలస: ములగపాకవానిపాలెంలో పొట్నూరు ఇంటిపేరు కలిగిన మహిళలంతా పుట్ట వద్దకు వెళ్తున్న దృశ్యం


విజయనగరం కల్చరల్: పుట్టల వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్న నగరవాసులు


సంతకవిటి: మోదుగులపేటలో పుట్టల వద్దకు పొలాల గట్లుపై వెళ్తున్న ప్రజలు


విజయనగరం: ఫూల్‌బాగ్ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో పుట్టలకు పూజలు

జల కాలుష్యంపై విచారణ


చెరువును పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ శార్వాణి

రేగిడి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సంకిలి చక్కెర కర్మాగారం నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాల వల్ల తమ పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని అప్పాపురం మాజీ సర్పంచ్, ఆ గ్రామ రైతు పల్లా వెంకట్రావు చేసిన ఫిర్యాదుపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ శార్వాణి శనివారం విచారణ నిర్వహించారు. కార్మాగార పరిధి దేవుదళ రెవెన్యూలో వంకాయలవాని చెరువులో ఫ్యాక్టరీ వ్యర్థ జలాలు చేరి.. తమ పంటపొలాలు పాడవుతున్నాయని బాధిత రైతు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు అందించాడు. దీనిపై సంబంధిత చెరువును, ఆయకట్టు పొలాలను ఏఈ పరిశీలించారు. చెరువు నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు జోనల్ కార్యాలయానికి నివేదిస్తామని, ల్యాబ్ రిపోర్టుల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

విప్లవ గాయకుడికి నివాళి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బహుజన వాగ్గేయకారుల సాహిత్యాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని బహుజన నేతలు ఆదాడ మోహనరావు, పి.ప్రభాకరరావులు అన్నారు. విప్లవ గాయకుడు కోళ్ళూరి ప్రసాద్ జయంతి సందర్భంగా విజయనగరంలోని దళిత ఐక్యవేదిక కార్యాలయంలో గాయకుడు ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసాద్ సినీ గేయ రచయితగా, అనువాదకుడిగా, వక్తగా, విశ్లేషకుడిగా అనేక రంగాల్లో విశేష సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నేతలు సూర్యనారాయణ, చోడి ఆదినారాయణ, వెంకటరమణ, నారాయణప్పుడు, భాస్కర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు


టేబుల్ టెన్నిస్ పోటీలకు బయలుదేరిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో జరుగనున్న స్కూల్స్ గేమ్స్‌లో టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు విజేతలుగా నిలవాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు గోపాల్, విజయలక్ష్మిలు ఆకాంక్షించారు. విశాఖ జిల్లాలోని గోపాలపట్నంలో జరుగనున్న స్కూల్ గేమ్స్ అండర్-14, 17 బాలబాలికల టేబుల్ టెన్నిస్ పోటీలకు విజయనగరం క్రీడాకారులు శనివారం బయలుదేరారు. ఈ టీమ్‌లకు కోచ్ మేనేజర్లుగా శ్రీనివాస్, ఎర్నమ్మలు వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు.

ఫిర్యాదుల పరిష్కారంలో వేగం అవసరం

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, నాణ్యత రెండింటిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. శనివారం పీజీఆర్ఎస్‌పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విభాగం నుంచి ఎస్ఎల్ఏ గడువులో ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆలస్యంగా పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్షించి... కారణాలను నమోదు చేయాలని ఆదేశించారు. ప్రీ ఆడిట్ దశల్లో ఉన్న ఫిర్యాదులపై దృష్టి పెట్టాలన్నారు. రీ ఓపెనింగ్స్ నివారించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యధిక ఫిర్యాదులు రెవెన్యూ శాఖలోనే ఉన్నందున, వాటిపై ప్రత్యేక పర్య వేక్షణ ఉండాలని సూచించారు. దాదాపు 44శాతం అసంతృప్తి నమోదు కావడంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. అసంతృప్తి కేసులు సరిగా నమోదు చేయడంలో, డేటా అప్డేట్ చేయడంలో నిర్లక్ష్యం కనబరుస్తున్న విభాగాలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఐపీల ఫిర్యాదుల పరిష్కారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిందాల్ భూ సమస్యలపై ఆర్డీవో స్థాయిలో పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జేసీ సేతుమాధవన్, డీఆర్వో శ్రీనివాస్‌మూర్తి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి మురళి పాల్గొన్నారు.

రూ.66.36 కోట్లతో అమృత పథకం అమలు


సిబ్బందితో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ ప్రభాకరరావు

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర వాసులకు ఇబ్బంది కలుగకుండా రూ.66.36 కోట్లతో అమృత-2 పథకాన్ని అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఎం.ప్రభాకరరావు స్పష్టం చేశారు. శనివారం ముషిడిపల్లి వాటర్ వర్క్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అమృత-2 ప్రతిపాదిత అంశాలపై సమీక్షించారు. అలాగే నగరంలో నీటి సరఫరాను తనిఖీ చేశారు. గతంలో చేపట్టిన పథకాల అమలుతీరును పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అమృత-2 పథకం కింద రూ.66.36కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందన్నారు. ఇంకా సాంకేతిక ఆమోదం రావాల్సి ఉందని.. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే 10ఎంఎల్‌డీ జలాల అభివృద్ధి విధానాన్ని పరిశీలించారు. 600 ఎంఎం గ్రావెటీ మెయిన్ లైన్ మార్పుతో పాటు ఇతర పనులను ప్రతిపాదించారని తెలిపారు. సూపరింటెండెంట్ పి.కామేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జ్యోతి, కార్పొరేషన్ ఈఈ ప్రసాద్, డీఈలు శ్రీనువాసరావు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశా లలో శనివారం నిర్వహించిన న్యాయఅవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ర్యాగింగ్ నిరోధక చట్టం, పోక్సో, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు తదితర చట్టాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాలల మేనేజ్‌మెంట్ కచ్చితంగా ర్యాగింగ్ నిరోధించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. పిల్లలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, శిక్షలపై సదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ న్యాయాధికారి నైమిష వివరించారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిందాల్ భూముల్లో వాటాలా?


రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తాము 18 ఏళ్ల కిందట జిందాల్ పరిశ్రమకు ఇచ్చిన భూములు ఇప్పుడు కొంతమందికి వాటాలుగా మారనున్నాయన్న ప్రచారం జరుగుతుందని.. దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. శనివారం బొడ్డవరలో 125వ రోజు నిరసనలో భాగంగా వారు రిలే దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తమకు న్యాయం జరగకుండా చేస్తున్నారని, కంపెనీతో కలిసి తమను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

కుక్కను తప్పించబోయి..

- అదుపు తప్పి స్కూటీ బోల్తా
- అపస్మారక స్థితిలో భార్య
- భర్త, ముగ్గురు పిల్లలకు గాయాలు


గాయాల పాలైన పిల్లలు

భోగాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురయ్యింది. భార్య అపస్మారక స్థితిలోకి వెళ్లగా.. భర్తతోపాటు ముగ్గురు పిల్లలకు తీవ్ర గాయాల య్యాయి. జాతీయ రహదారిపై నవరవల్లి సమీపంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నందిగాం గ్రామానికి చెందిన గరి విజయలక్ష్మి, సూరిపాత్రుడు అనే భార్యభర్తలకు ఆరేళ్ల లోపుగల ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. శనివారం సాయంత్రం సూరిపాత్రుడు తన స్కూటీపై వారందరినీ స్వగ్రామం నుంచి తన అత్తవారి ఇల్లు విశాఖ జిల్లా మధురవాడకు తీసుకు వెళ్తున్నాడు. నవరవల్లి సమీపంలోకి వచ్చేసరికి రహదారికి అడ్డంగా కుక్క వచ్చింది. దాన్ని తప్పించబోయే క్రమంలో స్కూటీ బోల్తా పడింది. అందరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. విజయలక్ష్మికి తీవ్ర గాయాలు కాగా.. అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. సూరిపాత్రుడుకు కూడా గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. హైవే అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రులను తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ కుటుంబమంతా అక్కడ చికిత్స పొందుతోంది. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదని సీఐ కె.దుర్గాప్రసాదరావు తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరవాసులంతా అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 26 నుంచి 29 వరకూ తుఫాన్ తీవ్రరూపం దాల్చనుందని తెలిపారు. కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, తుఫాన్ కారణంగా ఎవరైనా ఇబ్బందులు పడితే 9849906486 నెంబరుకు కాల్ చేయవచ్చన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్ర మత్తంగా ఉండాలన్నారు. తుఫాన్ వల్ల పట్టణవాసులు ఇబ్బందులకు గురైతే స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. ● వేపాడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.రాములమ్మ సూచించారు. ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించిందని తెలిపారు. రాబోయే 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని చెప్పారు.

కల్తీ మద్యాన్ని తెలుసుకోవచ్చు


క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న టీడీపీ నాయకుడు చంద్రశేఖరరావు

డెంకాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు, బార్లలో మద్యం కొనేముందు క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా నాణ్యమైన మద్యమా.. కాదా అని తెలుసుకోవచ్చునని డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు తెలిపారు. శనివారం ఆయన డెంకాడలో మద్యం దుకాణాన్ని పరిశీలించారు. మద్యం నాణ్యతను సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, పార్టీ మండల జనరల్ సెక్రటరీ కొయనేని రమణ, ఉపాధ్యక్షుడు పడాల చిన్నారావు, యాదవ సాధికార సమితి కన్వీనర్ కొర్నాన ఆదిబాబు, సింగవరం సర్పంచ్ పిట్ట అప్పారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన త్రైక్వాండో పోటీలు

విజయనగరం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి త్రైక్వాండో ముగింపు కార్యక్రమానికి ఆమె శనివారం హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులకు మెడల్స్‌ను అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి సుంకరి సతీష్, కమిటీ సభ్యులు కె.రాంబాబు, బుగత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా నందన్న అనుపోత్సవం

- ఊరేగింపులో అలరించిన బళ్ల వేషాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం నందన్న సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీపావళి రోజున గ్రామాల్లో నందన్నలు కొలువుతీరగా నాగులచవితి రోజున అనుపోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో పులివేషాలు, కోయ డ్యాన్సులు.. తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


బాడంగి: గజరాయనివలసలో నందన్నను ఊరేగిస్తున్న దృశ్యం


బొండపల్లి: కనిమెరకలో..


రామభద్రపురం: ఆరికతోటలో..


గజపతినగరంలో పులివేషాలు


గరుగుబిల్లి: పెద్దూరులో ఉత్సవ మూర్తుల ఊరేగింపు


బొబ్బిలి రూరల్: పెంటలో కొలువుదీరిన నందన్న


చీపురుపల్లిలో బళ్ల వేషాలు

మన బస్సులు భద్రమేనా?

(ఐదో పేజీ తరువాయి)

భువనేశ్వర్ నగరాలకు బస్సులు జిల్లా మీదుగా వెళ్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ట్రావెల్ బస్సులు రాత్రిపూట రాకపోకలు సాగిస్తున్నాయి. మితిమీరిన వేగంతో దూసుకుపోతుంటాయని అందరూ చెబుతున్నారు. ఈ విషయంలో వారికి అధికారులు మార్గనిర్దేశం ఇచ్చే పరిస్థితి లేదు.

50 శాతానికిపైగా రిజిస్ట్రేషన్లు అక్కడే..

జిల్లాలో 100 వరకూ సొంత ట్రావెల్ బస్సులు ఉన్నాయి. మరో 50 వరకూ ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ఉన్నారు. వీటిలో 50 శాతానికిపైగా స్థానికంగా రిజిస్ట్రేషన్ లేనివే. ఎక్కువగా ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, సిక్కిం రాష్ట్రాల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఉంటున్నాయి. అక్కడ తక్కువ పన్ను, ఫీజుతో పాటు క్షణాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. కేవలం వాట్సాప్, మెయిల్‌లో వివరాలు పంపిస్తే చాలు రిజిస్ట్రేషన్ పూర్తయినట్టే. దీనివల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 వేలు చెల్లిస్తే సరిపోతుంది. మన దగ్గర అయితే స్లీపర్ బెర్తులు 36కుగాను ఒక్కో బెర్తుకు రూ.3,500 చొప్పున..ప్రతి మూడు నెలలకు రూ.1,25,000 చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఏడాదికి సుమారు రూ.5 లక్షలు ఖర్చు చేయాలి.

భద్రతా ప్రమాణాలు అంతంతే..

ప్రస్తుతం బీఎస్6 బస్సులు ఎక్కువగా అందుబాటులోకి వచ్చాయి. వీటిలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాల విషయమై కొంత నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్‌ను వారు తప్పనిసరిగా తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్, ఇతర కారణాల వల్ల మంటలు చెలరేగినప్పుడు బస్సు బాడీ ప్రమాదాన్ని నియంత్రించే విధంగా ఉండాలి. దీనిని నిర్ధారించేందుకే ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ జారీ చేస్తారు. మన రాష్ట్రంలో ఈ సర్టిఫికెట్ ఉంటేనే బస్సు రిజిస్ట్రేషన్ జరుపుతారు. అయితే ఈ సేఫ్టీ సర్టిఫికెట్ పొందడానికి రూ.2 లక్షలు ఖర్చు అవుతుంది. అదే ఈశాన్య రాష్ట్రాల్లో అయితే రూ.50 వేలుతో అయిపోతుంది. కనీస భద్రత చూడకుండా సంబంధిత అధికారులు దళారీల ద్వారా ఆ రాష్ట్ర ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. మరోవైపు బీఎస్6 బస్సులు సౌకర్యవంతంగా ఉంటాయి. అయితే వీటిలో 200 వరకూ వైర్లు ఉంటాయి. చిన్న సమస్య వచ్చినా సంబంధిత కంపెనీ ప్రతినిధి రావాల్సిందే. దీంతో తనిఖీలను ట్రావెల్స్ యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఇదే ప్రమాదాలకు కారణమవుతోంది.

● విజయనగరంతో పాటు జిల్లాలో ప్రధాన పట్టణాల్లో సాయంత్రం 5 దాటితే చాలు ట్రావెల్ బస్సుల హవా కనిపిస్తోంది. ఆ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను లెక్కచేయడం లేదు. పోలీసులు సైతం పట్టించుకోవడం లేదు. కనీసం కర్నూలు ఘటనతోనైనా యంత్రాంగంలో చలనం వస్తుందా? అనేది చూడాలి.

● నిజానికి అన్నీ ట్రావెల్స్ బస్సులకు పూర్తి స్థాయిలో అనుమతులు ఉండవు. కేవలం టూరిస్టు బస్సులుగానే అనుమతులు ఇస్తారు. వివిధప్రాంతాల నుంచి విజయనగరం మీదుగా ప్రయాణించే అనేక బస్సులకు స్టేజీ పర్మిషన్ లేదు. ఆర్టీవో అధికారుల్లో ఒకరికి ప్రైవేట్ ట్రావెల్స్ నుంచి భారీగా ముడుపులు రావటంతో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు..

జిల్లాలో ప్రైవేటు బస్సులు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం. ఆరు నెలల నుంచి తనిఖీలు చేపట్టి గూడ్స్ లగేజీతో ఉన్న వాహనాలపై 30 కేసులు నమోదుచేశాం. ప్రతి సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం. నాలుగు బృందాలు ఏర్పాటు చేసి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నాం.

-మణికుమార్, రవాణాశాఖ ఉప కమిషనర్, విజయనగరం

సమన్యాయం అందరి హక్కు

(ఐదో పేజీ తరువాయి)

కలెక్టర్ రామసుందర్ రెడ్డి చెప్పారు. ఈ అవకాశాన్ని బాధితులు వినియోగించుకోవాలని సూచించారు. మండల, గ్రామస్థాయిలో కూడా న్యాయ సేవాధికార సంస్థ న్యాయ సేవలపై అవగాహన కల్పించాలన్నారు.

● పోక్సో చట్టం ద్వారా రాష్ట్రంలోనే అత్యధికంగా విజయనగరం జిల్లాలో సుమారు 20 మంది దోషులకు శిక్ష పడిందని ఎస్పీ దామోదర్ తెలిపారు. ప్రతి వ్యక్తికీ రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని, వాటి ఉల్లంఘన జరిగితే పరిరక్షించడానికి వివిధ చట్టాలు ఉన్నాయని చెప్పారు.డిజిటల్ అరెస్టు పేరుతో ఇటీవల కొన్ని మోసాలు జరుగుతున్నాయని, ఇలాంటివి ఎవరికైనా ఎదురైనప్పుడు ధైర్యంగా ఉండాలని, భయపడవద్దని ఎస్పీ సూచించారు. మహిళలకు రక్షణ కల్పించే శక్తి యాప్‌పై విస్తృతంగా ప్రచారంచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కృష్ణప్రసాద్, ఐసీడీఎస్ పీడీ విమలరాణి పాల్గొన్నారు.

బంగ్లాలో బందీలుగా..

(ఐదో పేజీ తరువాయి)

మారుపల్లి ప్రవీణ్, సురపతిరాము, సూరాడ అప్పలకొండ, పూసపాటిరేగ మండలం తిప్పలవలసకు చెందిన నక్క రమణ, వాసపల్లి సీతయ్య, బర్రిపేట చింతపల్లికి చెందిన మైలపల్లి అప్పన్న కలిసి విశాఖ హార్బర్ నుంచి ఈ నెల 13న సముద్రంలో వేటకు బయలుదేరారు. వేటసాగిస్తూ ఈనెల 22న పొరపాటున సముద్ర జలాల్లో భారత్ సరిహద్దు దాటేశారు. బంగ్లాదేశ్ జలాల్లోకి రావడాన్ని అక్కడి కోస్టుగార్డు అధికారులు గమనించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు.ప్రస్తుతం వారంతా అక్కడి జైలులో బందీలుగా ఉన్నారు.వీరిని స్వగ్రామం తీసుకురావడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్ని చర్యలు చేపడుతున్నారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు కూడా మత్స్యకారులను స్వగ్రామాలకు తీసుకురావడానికి నిరంతరంఅధికారులు, మంత్రులతో మాట్లాడుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్నారు.

సెంచూరియన్‌లో ముగిసిన వర్క్‌షాపు

నెల్లిమర్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించి ఎఐ-డ్రివన్ ఎంబెడ్డెడ్ సిస్టమ్స్ అనే మూడు రోజుల ప్రాక్టికల్ వర్క్‌షాపు శనివారం విజయవంతంగా ముగిసింది. విద్యార్థులకు కృత్రిమ మేథస్సుని ఎంబెడ్డెడ్ సిస్టమ్స్‌లో ఏకీకృతం చేసే విధానంపై ప్రాక్టికల్ అవగాహన కల్పించడం, రియల్‌టైమ్ ప్రాజెక్టుల ద్వారా వారి సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్సపర్సన్‌గా వరంగల్‌కు నుంచి కేపీఐటీ టెక్నాలజీస్ సందీప్, బెంగుళూరు నుంచి మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పాల్గొన్న విద్యార్థులకు ఏఐ కాన్సెప్ట్, ఎంబెడ్డెడ్ ప్రోగ్రామింగ్, సిస్టమ్స్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలపై విలువైన జ్ఞానం సంపాదించి సృజనాత్మకమైన మినీ ప్రాజెక్టులు విజయవంతంగా రూపొందించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి విద్యార్థులతో పరస్పర చర్చలు జరిపి వారి వినూత్న ఆలోచలను ప్రశంసించి కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై నిరందర పరిశోధన చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డీన్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు పల్లవి, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు

దత్తిరాజేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకాద పంచాయతీలోని మద్దిపేటలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగాఉంది. ఎప్పుడు కూలిపోతుందో.. ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ గ్రామస్థులు బిక్కుమని జీవిస్తున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించు కోలేదని వారు వాపోతున్నారు. కొద్ది నెలలుగా స్తంభం పడకుండా కర్రను దన్ను పెట్టారు. అయితే వైర్లు నేలకు వేలాడుతుండడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కూలిపోతున్న స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ పెద్దింటి మోహన్‌తో పాటు గ్రామస్థులు కోరుతున్నారు.



వైర్లు వేలాడుతున్న దృశ్యం

మహావీర్ భూములపై కలెక్టర్‌కు నివేదిక

● డొంకినవలస గ్రామస్థుల ఫిర్యాదుతో విచారణ

బాడంగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మహావీర్ కంపెనీకి విక్రయించిన భూములపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని బొబ్బిలి ఆర్డీవో రామ్మోహన్‌రావు తెలిపారు. మహావీర్ కంపెనీ భూముల అప్పగించాలని డొంకినవలసకు చెందిన 40 మంది రైతులు ఇటీవల కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో బొబ్బిలి ఆర్డీవో రామ్మోహన్‌రావుకు విచారించాలని ఆదేశించారు. గతంలో ఓ సారి ఆర్డీవో విచారణకు రాగా అందరు మూకుమ్మడిగా ఏకవాగ్మూలం ఇచ్చారు. దీనిని కలెక్టర్‌కు ఆర్డీవో పంపించారు. దీనిని పరిశీలించిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో వేర్వేరుగా అర్జీలు చేసుకున్న సందర్భంగా వారి అభిప్రాయాలను నమోదు చేయాలని కోరారు. దీంతో శనివారం ఆర్డీవో రామ్మోహనరావు సిబ్బందితో డొంకినవలస చేరుకొని విచారణ నిర్వహించారు. ఈసందర్భండా 20మంది రైతులు హాజరయ్యారు. 1980-81లో తమ భూములను ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని పేర్కొనడం వల్లే భూములు కంపెనీకి విక్రయించామని తెలిపారు. 45 సంవత్సరాల నుంచి వారు ఎటువంటి అభివృద్ధి చేయలేదని, దీంతో తిరిగి భూములను తమకు అప్పగించాలని రైతులు ఆర్డీవోను కోరారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ రైతులు 1980-81లో మహావీర్ కంపెనీకి విక్రయించినట్లు రైతులుఒప్పుకున్నారని,దీనిని నమోదుచేశామని కలెక్టర్‌కు నివేదించనున్నామని తెలిపారు.అయితే రైతులు రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత భూములు తమకు తిరిగి అప్పగించాలన్న విషయాన్ని తెలియజేశారని, ఈ విషయాలను పొందుపరచామని, ఇదేవిషయాన్ని కలెక్టర్‌కు నివేదించి వారి ఆదేశాల అనుగుణంగా ముందుకువెళ్తామని చెప్పారు. ప్రస్తుతం రైతులు ఈ కంపెనీ భూములను సాగుచేసుకుంటున్నట్లు విచారణలో తేలినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, డీటీలు రమేష్, అప్పలనాయుడు, ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది రెవెన్యూ సిబ్బంది, గ్రామానికి చెందిన డాక్టర్ గోపీనాథ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆర్నెపల్లి సింహాచలం, అర్జీదారులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రామ్మోహనరావు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

●శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయించాలి

● మండల ప్రత్యేకాధికారి మురళీనాథ్

బొబ్బిలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మురళీనాథ్ తెలిపారు. శనివారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28, 29 తేదీల్లో మంత తుఫాన్ నేపథ్యంలో ఎంపీడీవో పి.రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28వ తేదీ రాత్రి విశాఖ,కృష్ణ మధ్య కాకినాడ దగ్గరగా తీరం దాటే అవకాశంఉండడంతో ప్రజలు ఇళ్లల్లో సురక్షితంగా ఉండాలని కోరారు. అధికారులు నదీపరివాహక ప్రాంతాల్లో పర్యటించి కాలువలు, చెరువులు గండికొట్టకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవ సర పరిస్థితులు తలెత్తితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశిం చారు. శిథిలావస్థకుచేరిన ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని కోరారు. శిథి లావస్థకు చేరిన ప్రభుత్వభవనాల వైపు ఎవరినీ అనుమతించవవద్దని సూచించారు. చెరువులను పర్యవేక్షించి, కట్టలు తెగే పరిస్థితి ఉత్పన్నమైతే, తీసుకోవలసిన జాగ్ర త్తలను వివరించారు.



మాట్లాడుతున్న మురళీనాథ్

శంబర పోలమాంబకు పూజలు

మక్కువ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర పోలమాంబను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు సత్కరించారు.

పత్తి రైతు కంట క'న్నీరు'

● ఎడతెరపిలేని వర్షాలకు కుళ్లిపోతున్న కాయలు, మొక్కలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొద్దిరోజులుగా కురుస్తు న్న ఎడతెరిపిలేని వర్షాల పుణ్యమాని పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో గల పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో మొక్కలు కుళ్లిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణప్పవలస, గొర్లెసీతారాంపురం, మెట్టవలస తదితర గ్రామాల్లో ఇప్పటికే పత్తికాయలు కుళ్లిపోయి నల్లగా మారడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పంట చేతికందే సమయంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. కొందరు రైతులు పండిన పత్తిని గ్రామాల్లో రోడ్లపై ఆరబెడుతున్నారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టి సాగుచేసిన పంట కళ్ల ముందే పాడవుతుండంతో లబోదిబోమంటున్నారు. కొన్నిచోట్ల పంటకు తెగుళ్లు కూడా ఆశించడంతో నాణ్యత తగ్గిపోతోంది. ఎకరాకు 2 నుంచి 2.5 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సి ఉండగా అంతకంటే తక్కువ దిగుబడి వస్తోందని వాపోతున్నారు. గిట్టుబాటు ధర కూడా క్వింటాకు రూ.7000 పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ తమని ఆదుకొని గిట్టుబాటు ధర కల్పించి పత్తిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



నారాయణప్పవలసలో తడిసిపోయిన పత్తిని రోడ్డుపై ఆరబోసిన దృశ్యం

సురక్ష యాప్‌పై అవగాహన

బొబ్బిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని 25 మద్యం షాపులు, మూడు బార్ అండ్ రెస్టారెంట్లు దగ్గర ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌పై ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు,సిబ్బంది అవగాహనకల్పించారు. ఈమేరకు మద్యం వినియోగదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. యాప్ వివరాలతో కూడిన పోస్టర్స్‌ను అతికించారు. సుమారు 500 మంది వినియోగదారుల మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. మద్యంలో నాణ్యతను గుర్తించేందుకు ఈ యాప్‌లు ఎంతగానో దోహదపడతాయని సీఐ చిన్నంనాయుడు వినియోగదారులకు అవగాహన కల్పించారు.

ఆరో తేదీ నుంచి నాటిక పోటీలు

బొబ్బిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విజయనగరం గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో వచ్చే నెల 6 ,7 ,8 తేదీల్లో ఉమ్మడి రాష్ట్రాల స్థాయి తెలుగు నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు నటరత్న నాటకపరిషత్ అధ్యక్ష, కార్యదర్శి అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక కళాభారతి ఆడిటోరి యంలో కళాభారతి ప్రతినిధులు నంబియా ర్ వేణుగోపాలరావు, కర్రి సత్యనారాయణ, పుల్లెల శ్రీనివాసరావు నాటిక పోటీల గోడపత్రికలను ఆవిష్కరించారు.

తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి క్రీడాకారులు ఈనెల 26, 27 తేదీల్లో కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీలకు అండర్-19 విభాగంలో పాల్గొనేందుకు ఎంపి కైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. దేవరశెట్టి ఆదిత్య, దాసరి జాహ్నవి, పిరిడి సాయిసంజనలు ఈ పోటీలో పాల్గొంటున్నా రని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు.

ఆరోగ్య సర్వేలు పక్కాగా చేయాలి

● ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి జగన్మోహనరావు

సీతానగరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సర్వేలు పక్కాగా చేపడుతూ వ్యాధులను గుర్తించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని వెంకటాపురంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య తనిఖీ రికార్డులు పరిశీలించి నమోదవుతున్న అనారోగ్య సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌సీడీ సర్వే తీరుపై ఆరాతీసి ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించి రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ లక్షణాలు గుర్తించాలని కోరారు. ప్రధానంగా నోటి, రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ అనుమానిత లక్షణాలను ముందస్తుగా గుర్తించి క్యాన్సర్ ముప్పు నుంచి తప్పించే విధంగా కృషి చేయాలని తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే నిర్ధేశించిన లక్ష్యాలను చేయాలని పేర్కొన్నారు. ఏ చిన్న అనారోగ్య లక్షణాన్ని గుర్తించినా తక్షణమే చికిత్స అందేలా చూడాలని తెలిపారు. సంచార చికిత్స శిబిరంలో దీర్ఘకాలిక రోగుల పర్యవేక్షణ, వారి ఆరోగ్యం మెరుగుపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సంధ్య, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

సాలూరు రూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి):టెట్ నుంచి ఇన్ సర్వీసు టీచర్లుకు మినహాయించాని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్య క్షుడు ఎం.మహేష్, ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ శనివారం ఒక ప్రక టనలో కోరారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా 2011 నుంచి కేంద్ర ప్రభుత్వం టెట్‌ను అమల్లోకి తెచ్చిందని, కొత్త ఉపాధ్యాయులకు టెట్‌ను తప్పనిసరి చేశారని తెలిపారు. అయితే ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిపై చట్టాన్ని తిరిగి రెట్రోస్పెక్టివ్‌గా చేయడం సరికాదని పేర్కొన్నారు. 25 నుంచి 30 ఏళ్ల నుంచి సేవలందిస్తున్న వారు ఇప్పుడు టెట్ రాయాలనడం సరికాదని పేర్కొన్నారు.

బెలగాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌మినహాయింపు ఇచ్చేలా చర్యలుతీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకుడు మర్రాపు మహేష్ డిమాండ్‌చేశారు.శనివారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పుపై రివ్యూపిటిషన్ వేయాలని కోరారు.